ఫలించిన ప్రక్షాళన మంత్రం

- సున్నం చెరువు అభివృద్ధితో స్థానికుల్లో ఆనందం
- తగ్గిన దోమల బెడద
- హైడ్రా చర్యలే కారణమంటున్న పరిసర ప్రాంతాల ప్రజలు

అల్లాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రీనగర్ కాలనీ, తులసీ నగర్, జ్యోతి నగర్ కాలనీ, వివేకానంద నగర్(అల్లాపూర్), పర్వత్‌నగర్ తదితర ప్రాంతాలు ఇటీవలి కాలం వరకు దోమలకు నెలవు. సాయంత్రం అయిందంటే దోమల దండయాత్ర మొదలవుతుందన్న భయం స్థానికుల్లో ఉండేది. ప్రతి ఇంటా దోమల బ్యాట్ కచ్చితంగా ఉండాల్సిందే. అలాంటిది ప్రస్తుతం పరిస్థితి మారింది. దోమల వ్యాప్తి చాలా వరకు తగ్గిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల ప్రక్షాళనే కారణమా?

గత ఏడాది వరకు అల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో విపరీతమైన దోమల బెడద ఉండేది. జీహెచ్ఎంసీ ఎంటమాలజీ వారికి నిత్యం ఫిర్యాదుల వెల్లువ ఉండేది. అలాంటిది ఇప్పుడు ఫిర్యాదులు బాగా తగ్గాయని శాఖాధికారులు చెబుతున్నారు. దోమల విషయంలో ఇంతలా మార్పు రావడానికి హైడ్రా చేపట్టిన చెరువుల ప్రక్షాళనే ప్రధాన కారణమా అన్న చర్చ జరుగుతోంది. చెరువులను చెరబట్టి, మురుగు నీటిని మళ్లించిన పరిస్థితులు గతంలో ఉండేవని, ప్రస్తుతం ఆయా చెరువుల సుందరీకరణ పనులతో అల్లాపూర్ పరిసరప్రాంతాల వారికి ఉపశమనం కలుగుతోందని పలువురు అంటున్నారు.

పరిశుభ్రమైన నీటితో చెరువుకు కళ..

శేరిలింగంపల్లి, షేక్‌పేట, కూకట్‌పల్లి మండలాల పరిధిలో ఉండే సున్నం చెరువు తమ పరిధిలోనిది కాదని ఒకరంటే తమది కాదని ఇంకొకరు.. ఇలా అధికారుల నిర్లక్ష్యంతో అధిక భాగం కబ్జాకు గురైంది. ఉన్న కాస్త చెరువు గతేడాది దాకా మురుగుమయంగా ఉండేది. ప్రస్తుతం చెరువులోని నీళ్ల తోడి, పూడిక తీత పనులు పూర్తి చేయడంతో కొద్ది నెలలుగా కురుస్తున్న వర్షాల కారణంగా శుద్ధ నీరు వచ్చి చేరుతోంది. అయితే సైట్ 3 కాలనీ వైపు సున్నం చెరువులో ఇప్పటికీ మురుగు నీరు కలుస్తోందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురుగును సైతం అడ్డుకుంటే హైటెక్ సిటీ నడిబొడ్డున ఫ్రెష్ వాటర్ లేక్‌గా సున్నం చెరువు వెలుగొందుతుందని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అధికంగా ఉండే గాయత్రీనగర్ కాలనీ వాసులు అభిప్రాయపడుతున్నారు.


ఫిబ్రవరిలో గుర్రపు డెక్కతో నిండి ఉన్న సున్నం చెరువు (ఫైల్)


ప్రస్తుతం శుభ్రమైన నీటితో సున్నం చెరువు

దోమల నివారణకు పటిష్టమైన చర్యలు



దోమల నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. ఒక్క డెంగీ కేసు నమోదైనా ఆ ప్రాంతంలో 100 మీటర్ల వ్యాసం పరిధిలో 'యాంటీ లార్వల్ ఆపరేషన్' ఏర్పాట్లు చేస్తున్నాం. ఎంటమాలజీ శాఖ వారితో సమన్వయం చేసుకుని గృహ సముదాయాల్లో స్ప్రేయింగ్, ఫాగింగ్‌తో పాటు బహిరంగ ప్రదేశాల్లో కొబ్బరి బొండాలు, టైర్లు వంటి లార్వా కారకాలను ఏరివేస్తున్నాం. దోమల నియంత్రణ ప్రక్రియ సక్రమంగా జరుగుతోంది.

- డా. కార్తీక్, ఏఎంఓహెచ్, జీహెచ్ఎంసీ మూసాపేట్ సర్కిల్

హైడ్రా చర్యలతోనే..

గతేడాది క్రితం వరకు దోమల బెడదతో నిత్యం ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ సమస్య లేదు. సున్నం చెరువు అభివృద్ధి, హైడ్రా చర్యలతోనే మా ప్రాంతంలో దోమల బెడద తగ్గింది. హైడ్రాకు కృతజ్ఞతలు.

- వెంకటాచార్యులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, గాయత్రీనగర్ కాలనీ

తాగునీటి పైపులైన్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం

అల్లాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహ బేగం తులసీనగర్ కాలనీలో గురువారం పర్యటించారు. రూ.16 లక్షల వ్యయంతో జరుగుతున్న తాగునీటి పైప్‌లైను పనులను పరిశీలించిన సబీహ బేగం లో ప్రెషర్ కారణంగా తులసీ నగర్‌లోని పలు వీధుల్లో నీటి కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పనులు పూర్తయ్యాక నీటి కష్టాలు తీరతాయన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి గాయత్రీ నగర్ సెక్షన్ మేనేజర్ అన్వేత్ కుమార్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సాంబయ్య, చెన్న బంగారు నేత, పార్వతమ్మ పాల్గొన్నారు.

కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

బాలానగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి సునీతకు మద్దతుగా బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి గురువారం ప్రచారం నిర్వహించారు. ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్‌నగర్‌లో గడప గడపకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

ఎన్నికల ప్రచారంలో ఓల్డుబోయినపల్లి, కూకట్‌పల్లి బీజేపీ నాయకులు


బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంతారావు, తిరుపతియాదవ్ తదితరులు

ఓల్డుబోయినపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కూకట్‌పల్లి, ఓల్డుబోయినపల్లి డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు నేతృత్వంలో నాయకులు శ్రీకర్‌రావు, ఓల్డుబోయినపల్లి డివిజన్ నాయకులు ఏనుగుల తిరుపతి యాదవ్, సత్యమూర్తి, భీంరావు, శేఖర్, వరుణ్, రాజు తదితరులు బోరబండ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

వెలగని వీధి దీపాలు

అల్లాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ గాయత్రీ నగర్‌లోని ఆంధ్రా బ్యాంక్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు గత 20 రోజులుగా సరిగా వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండటం, సమీపంలో వైన్స్ షాపు ఉండటంతో మహిళలు, చిన్నారులకు ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి కూడలిలో వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆంధ్రా బ్యాంక్ కూడలిలో వెలగని హైమాస్ట్ లైట్లు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో కలవరం..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్స్‌తో పాటు కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఆపరేటర్లు సమయ పాలన పాటించడం లేదు. దీంతో 'సార్లు వచ్చినా.. ఆపరేటర్లు రారాయే..!' శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. ఆంధ్రజ్యోతిలో వచ్చిన అంశాలపై ఉన్నతాధికారులు లోలోన విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. దీంతో ఆపరేటర్లతో పాటు ఆయా కార్యాలయాల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందిపైనా విచారణ జరిగితే ఎలా? ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధుల నుంచి ఏమైనా సార్లకు చెప్పించాలా? లేదా అధికారుల కదలికలను మనకు అనుకూలంగా ఎలా మార్చుకుందాం అనే ఆలోచనలో ఉన్నారట. కొందరు అంతర్గత బదిలీలు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతుండగా.. మరి కొందరు మాత్రం సీటును వదిలేందుకు ఏమాత్రం ఆసక్తి కనబర్చడం లేదు. తాజాగా ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు సైతం చర్యలు తీసుకోకపోతే తప్పు మనదే అవుతుందని చర్చించుకోవడం కనిపించింది. కనీసం హాజరు శాతం, ఉద్యోగుల పనితీరును బట్టి అందరినీ కాకపోయినా ఇద్దరి, ముగ్గురిపైన అయినా చర్యలు తీసుకోకపోతే ఎలా అని ఆలోచిస్తున్నారట. ఏది ఏమైనా ఆపరేటర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఒత్తిడికి తలొగ్గి సర్దుకు పోతారా? పారదర్శకతకు శ్రీకారం చుడతారా అన్నది తెలియాల్సి ఉంది.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోటా 31, వంకాయ 45, బెండకాయ 35, పచ్చి మిర్చి 35, బజ్జి మిర్చి 40, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజీ 28, బీన్స్ 75, క్యారెట్ 65, గోబి పువ్వు 30, దొండకాయ 35, చిక్కుడుకాయ 75, గోరు చిక్కుడు 50, బీట్‌రూట్ 50, క్యాప్సికం 60, ఆలుగడ్డ 23, కీర 23, దోసకాయ 18, సొరకాయ 20, పొట్లకాయ 28, కంద 35, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 20, మామిడి కాయ 15-20, అరటికాయ 10-11, చామగడ్డ 21, ముల్లంగి 6-8, చిలగడ దుంప 40, గుమ్మడికాయ 50, నిమ్మకాయలు 20-24, మునగ కాయలు 8-10, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 45, ఎండు మిర్చి 160, అల్లం 100, వెల్లుల్లి 160, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 50, కరివేపాకు 80, పర్వల్ రూ.50, పల్లికాయ 55, లోబా 40, ఆ కాకరకాయ 80. పైన పేర్కొన్న ధరలు ఈ రోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు

రాయదుర్గంలో పర్యటించిన ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలపై మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కొంతం చంద్రశేఖర్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఐటీ కారిడార్‌లో అత్యంత కీలకమైన రహదారిగా ఉన్న గచ్చిబౌలి బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి ఐకియా-మైండ్‌స్పేస్ జంక్షన్ మీదుగా హైటెక్ సిటీ- సైబర్ టవర్స్ వెళ్లే మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మార్గంలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినా ట్రాఫిక్ జామ్‌లు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణాలను తెలుసుకునేందుకు మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కొంతం చంద్రశేఖర్ రెడ్డి రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి ఆ మార్గంలో పర్యటించారు. ప్రధానంగా గెలాక్సీ టవర్స్, ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ ఉన్న కూడలిలో అక్రమ పార్కింగ్‌లు చేస్తున్నట్లు గుర్తించారు. గెలాక్సీ టవర్‌లో ఉన్న ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల కోసం వచ్చే వారు అక్కడి రోడ్ల మీద తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతున్నట్లు గుర్తించి, గెలాక్సీ టవర్ యజమానులతో ఏసీపీ చర్చించారు. సందర్శకులైనా, ఉద్యోగులైనా కమర్షియల్ కాంప్లెక్సుల్లోనే పార్కింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్‌లను తగ్గించేందుకు ఐటీ ఉద్యోగులతో పాటు కంపెనీల నిర్వాహకులు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి కోరారు.


రాయదుర్గంలోని గెలాక్సీ టవర్ వద్ద ట్రాఫిక్ జామ్ సమస్యలపై అక్కడి భవన నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్


పాపిరెడ్డికాలనీలో రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు


కూకట్‌పల్లి డయార్‌గూడలో రోడ్డుపై నిలిచి ఉన్న వాహనాలు

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

కూకట్‌పల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డికాలనీ, ఆస్బెస్టస్ కాలనీలో అక్రమ పార్కింగ్‌తో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలను రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండటంతో రోజురోజుకు ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. కూకట్‌పల్లి డయార్‌గూడ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి ఉంటున్నాయి. కొన్ని వాహనాలు నెలల తరబడి ఇక్కడే ఉన్నాయి. దీంతో ట్రాఫిక్ పీఎస్ నుంచి డయార్‌గూడ మీదుగా నల్లచెరువు వైపు వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

ఆస్బెస్టస్ కాలనీ కమాన్ వద్ద..

ఆస్బెస్టస్ కాలనీ కమాన్ నుంచి సాయిసుధ స్వీట్స్ దుకాణం వరకు, బస్తీ దవాఖానా భవనం చుట్టూ, బిర్ల కళ్యాణ మండపం వద్ద, పార్కు సమీపంలో, ప్రధాన రోడ్డులో వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు తప్ప సమస్యను పరిష్కరించడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలను తొలగించాలి

ఆస్బెస్టస్ కాలనీ కమాన్ సమీపంలో కొందరు తమ వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. దానికి తోడు అక్రమ పార్కింగ్‌తో కాలనీలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలి.

- ఎమ్.నరేశ్, ఆస్బెస్టస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

సీఎం సహాయనిధి అందజేత


సీఎం సహాయనిధి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దీనబంధు కాలనీకి చెందిన యూసఫ్‌కు మంజూరైన రూ.2.50లక్షల సీఎంఆర్ఎఫ్‌ను గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి వరంగా మారిందన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు: వంశీరెడ్డి


ఏసీపీ కార్యాలయంలో ఉన్న వంశీరెడ్డి తదితరులు

హైదర్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గోవధకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని అక్రమ అరెస్టులతో ఆపలేరని వివేకానందనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వంశీరెడ్డి అన్నారు. గోవుల రక్షణ కోసం ఉద్యమిస్తున్న హిందూ యువకుడిపై కాల్పులు జరగడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపిన వారిని అరెస్టు చేసి చిక్కడపల్లి ఏసీపీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గోవధకు వ్యతిరేకంగా ఉద్యమించే వారిపై అక్రమ కేసులు బనాయించి నిర్బంధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కల్యాణి, దుర్గాప్రసాద్, కృష్ణంరాజు, నర్సింగరావు, రేషన్ రాజు, లక్ష్మణ్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మహేంద్ర భాటి (ఫైల్)

మియాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలను ఇన్‌స్టాల్ చేస్తున్న కార్మికుడు విద్యుత్ షాక్‌తో మరణించిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మదీనగూడ ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీకి చెందిన మహేంద్ర భాటి (36) సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం మియాపూర్ ఆల్విన్ కాలనీ ప్రాంతంలో ఓ ఇంటిలో పనిచేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. సాటి కార్మికులు అతడిని ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యాచకుల వెతలు తీరేనా?

- జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో జంట సర్కిళ్లలో పూర్తయిన సర్వే
- 27 మందిని గుర్తించిన అధికారులు
- వాస్తవానికి 250 మందికి పైగా ఉంటారని అంచనా

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యాచకులకు మంచి రోజులు రానున్నాయా? కుటుంబంలో ఆదరణ లేని, ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులు చాలా మంది రోజూ పొట్టకూటి కోసం ఆలయాలు, బస్టాపులు, మెట్రో స్టేషన్ల వద్ద ఆహారం, డబ్బుల సాయం కోరుతూ కనిపిస్తుంటారు. కూడు, గుడ్డ, గూడు వంటి వాటితో పాటు వారి ఆరోగ్య పరిస్థితి ఏంటనే దానిపై జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 13, 14, 15 తేదీల్లో సర్వే జరిగింది. భిక్షాటన చేసే వారికి హక్కులు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. వీరికి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం శుభ వార్త చెప్పనుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సర్వే చేయాలని ఆదేశించగా.. జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో యాచకులపై సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందించారు.

జంట సర్కిళ్లలో సర్వే ఇలా..

జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి సర్కిల్ పరిధి ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలానగర్, కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్ కాలనీ, హైదర్‌నగర్ డివిజన్ల పరిధిలో పీవో భోగేశ్వర్లు ఆదేశాల మేరకు సీవోలు పాపన్న గౌడ్, ముస్తఫా, మహిపాల్‌రెడ్డి, సుజాత క్షేత్రస్థాయిలో సర్వేలో పాల్గొన్నారు. ఇక మూసాపేట్ సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, మూసాపేట్, అల్లాపూర్, ఫతేనగర్ డివిజన్ల పరిధిలో పీవో జంధ్యాల ఉమా ఆదేశాల మేరకు సీవోలు కొండబత్తుని మురళి, కిషోర్ కుమార్, ఇందిర సర్వేలో పాల్గొని యాచకుల డేటా సేకరించారు. భిక్షాటన చేసే సమయం, ఎదురవుతున్న సవాళ్లు, రాత్రిపూట నిద్రించే ప్రదేశం, అనారోగ్యం తలెత్తితే ఎక్కడకు వెళ్తారు? ఇలా సుమారు 20 ప్రశ్నలతో సర్వే చేయగా.. నాలుగు లేదా ఐదుగురు మించి కనీసం ఐదు ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. ఉదయం భిక్షాటన చేసుకొని సాయంత్రం ఇంటికి చేరుకునే వారే అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఏ ఒక్కరూ ఫోన్ నంబర్ ఇవ్వలేదు. కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్, మూసాపేట్ మెట్రో స్టేషన్, కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి బస్టాపులు, జేఎన్‌టీయూ చౌరస్తా, బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా, మూసాపేట్ చౌరస్తాల్లో ఉదయం, సాయంత్రం చేసిన సర్వేల్లో యాచకులు కొందరు అనారోగ్యంతో కనిపించారు. కొందరు మాట్లాడలేని స్థితిలో ఉండటం చూసి సర్వేకు వెళ్లిన ఉద్యోగులు భావోద్వేగానికి లోనయ్యారు. ఇలాంటి వారికి ప్రభుత్వం సహాయం చేస్తే బాగుంటుందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్‌లో 16 మందిని గుర్తించగా.. అందులో ఎనిమిది మంది పురుషులు, ఏడుగురు స్త్రీలు, ఒకరు దివ్యాంగులు కాగా.. మూసాపేట్ సర్కిల్ 11 మందిని గుర్తించగా.. అందులో ఏడుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. నగరంలో నివాసం ఉండేవారు చాలా తక్కువ. మహబూబ్‌నగర్, సంగారెడ్డి, జహీరాబాద్, మెదక్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్తుంటారని సర్వేలో తేలింది.


కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ వద్ద యాచకురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీవోలు పాపన్న గౌడ్, ముస్తాఫా, సుజాత


మూసాపేట్‌లో యాచకుడి నుంచి వివరాలు సేకరిస్తున్న సీవో కొండబత్తుని మురళి

నామమాత్రంగా సర్వే చేశారా?

జంట సర్కిళ్ల పరిధిలో నిత్యం భిక్షాటన చేసే వారికి న్యాయం చేయాలంటే అన్ని చోట్ల సర్వే జరగాల్సిన అవసరం ఉంది. రెండు సర్కిళ్లలో 27 మంది జాబితాను మాత్రమే ఉన్నతాధికారులకు పంపించారు. కానీ క్షేత్రస్థాయిలో కనీసం 250-300 మంది వరకు ఉంటారనే చర్చ నడుస్తోంది. ఏ ఆలయం వద్ద చూసినా కనీసం ఇద్దరు, ముగ్గురు యాచకులు తారస పడుతుంటారని వివేకానందనగర్‌కు చెందిన లక్ష్మీదేవి చెబుతున్నారు. ఇక కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు వద్ద ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిత్యం భిక్షాటన చేస్తూ ఉంటారని రోజూ ఆలయానికి వెళ్లే నాగలక్ష్మి చెబుతున్నారు. మరి ఏదో టార్గెట్ ఇచ్చారు కదా అని నామమాత్రంగా సర్వే చేయడం వల్ల ప్రయోజనం ఏముందన్నది తెలియాలి. సర్వే మూడు రోజుల్లో చేయమని ఆదేశాలు ఇచ్చినా ఇక్కడి వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని అవసరం అయితే మహిళా సంఘాల ప్రతినిధులు, ఆలయాల కమిటీ ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సహకారం తీసుకొని సర్వే చేస్తే ఎక్కువ మంది ఆ జాబితాలో ఉండేవారని పలువురు చర్చించుకుంటున్నారు.


చింతల్ ప్రధాన రహదారిలో నిలిచిన వరద నీరు

కుంట కాదు.. రోడ్డే!

కుత్బుల్లాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ ప్రధాన రహదారిలో షా థియేటర్ వద్ద చిన్నపాటి వర్షం కురిస్తే చాలు వరద నీరు నిలుస్తోంది. బుధవారం రాత్రి కురిసిన చిన్న వర్షానికే రోడ్డుపై చిన్న పాటి కుంటను తలపించేలా నీరు నిలిచింది. దీంతో ఆ మార్గంల వెళ్లే వాహన దారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. నిలిచిన నీటిలో ఎక్కడ గుంతలున్నాయో తెలియక భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత విభాగం అధికారులు స్పందించి నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


షాపూర్‌నగర్‌లో కురుస్తున్న వర్షం


రంగారెడ్డినగర్‌లో ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు

దంచి కొట్టిన వాన.. ఇబ్బందిపడిన వాహనదారులు

గాజులరామారం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సాయంత్రం ఒక్క సారిగా వర్షం దంచి కొట్టింది. గండిమైసమ్మ, బాచు పల్లి, నిజాంపేట, మల్లంపేట, కొంపల్లి, షాపూర్‌నగర్, జీడిమెట్ల, సూరారం, గాజులరామారంల్లో వర్షం కురవడంతో రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండి, ద్విచక్ర వాహనదారులు తమ గమ్యస్థానానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడ చూసినా రోడ్లపై వర్షం నీరు దర్శనమిస్తూ చెరువులను తలపించాయి.

మ్యాన్‌హోల్ పక్కన ప్రమాదకరంగా గొయ్యి

నిజాంపేట , అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట కార్పొరేషన్ పరిధిలో ఉన్న నల్లపోచమ్మ గుడి వద్ద నుంచి ప్రగతినగర్‌కు వెళ్లే దారిలో విజయపురి కాలనీ ఆరంభంలో మూలమలుపులోని షాపుల వద్ద మ్యాన్‌హోల్ పక్కన లోతైన గొయ్యి ఏర్పడింది. వర్షం నీరు అందులో చేరడంతో గుంత వెడల్పు అయ్యింది. ఫలితంగా ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు.


గొయ్యిలో స్థానికులు పెట్టిన కట్టె

ప్రమాదకరంగా ఉన్న ఈ గుంత చుట్టూ కొందరు హెచ్చరిక కోసం ఒక కట్టెను పాతి, దానికి ఒక బట్టను కట్టారు. పక్కనే మరో రెండు రాళ్లు పెట్టారు. ఈ గుంత వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ గొయ్యిని పూడ్చించాలని రచయిత, సామాజిక కార్యకర్త ఉదయ్‌కుమార్ కోరుతున్నారు.

తాగునీటి వృథాను అరికట్టండి

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల డివిజన్ అంగడిపేటలోని శివాలయానికి వెళ్లే రోడ్డులో తాగు నీటి పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో కొన్ని రోజులుగా నీటి సరఫరా జరుగుతున్న సమయంలో తాగు నీరు ప్రధాన రోడ్డుపై నుంచి సర్వీస్ రోడ్డుపై వృథాగా పారుతోంది.



దీంతో ఆయా ప్రాంతాల్లోని కాలనీలకు నీరు సరిగ్గా సరఫరా కావడంలేదు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తాగునీరు వృథాగా పోకుండా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని విమర్శించారు. తాగునీటి వృథాను అడ్డుకొని కాలనీలకు తాగునీరు అందించాలని పలువురు కోరుతున్నారు.

కుత్బుల్లాపూర్ కొత్త తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

గాజులరామారం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ మండలం తహసీల్దార్‌గా అశోక్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ సుజాత కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కొత్త తహసీల్దార్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా అధికారులను కలవాలని సూచించారు.


అశోక్‌కుమార్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మియాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలను ఇన్‌స్టాల్ చేస్తున్న కార్మికుడు విద్యుత్ షాక్‌తో మరణించిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మదీనగూడ ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీకి చెందిన మహేంద్ర భాటి (36) సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం మియాపూర్ ఆల్విన్ కాలనీ ప్రాంతంలో ఓ ఇంటిలో పనిచేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. సాటి కార్మికులు అతడిని ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మహేంద్ర భాటి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సుందరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా, జమ్మిగడ్డకు చెందిన పేరూరి తరుణ్ (19) మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ, కళాశాల వసతి గృహంలో ఉంటున్నాడు. ఇటీవల తరుణ్ తన స్నేహితులతో కలిసి కళాశాల సమీపంలో రూమ్ అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. బుధవారం రాత్రి తరుణ్, విన్నీ, రాతేష్ అనే స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనం నం. (టీఎస్09ఈబీ 3797)పై దూలపల్లి నుంచి కొంపల్లి వైపు వెళ్తుండగా, మార్గం మధ్యలో రామాలయం దగ్గర కొంపల్లి నుంచి దూలపల్లికి వస్తున్న జేసీబీ ఢీకొట్టింది ఈ ప్రమాదంలో తరుణ్‌కు తీవ్రగాయాలు కాగా, మిగతా ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. స్థానికులు తరుణ్‌ను 108లో సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సినీ షూటింగ్స్ స్పాట్‌గా

హెచ్ఎంటీ ఫారెస్ట్


నటీ నటులను,సెట్‌లను చూసేందుకు తరలివస్తున్న ప్రజలు


శ్మశాన వాటికలో ఉన్న శివుడి విగ్రహం సెట్

కుత్బుల్లాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని హెచ్ఎంటీ అటవీ ప్రాంతం సినిమా షూటింగ్‌ల స్పాట్‌గా మారింది. వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతం షూటింగ్‌లకు అనుకూలంగా ఉండడంతో వెబ్ సిరీస్‌లు, ప్రైవేట్ ఆల్బమ్‌లు, చిన్న, పెద్ద సినిమాలను ఇక్కడే తీస్తున్నారు. తమ అభిమాన నటీ, నటులను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంటోంది. నాలుగు నెలల క్రితం మారేడుమిల్లి పోలీస్ స్టేషన్, బకాసుర రెస్టారెంట్ సినిమాల షూటింగ్ హెచ్ఎంటీ ఫారెస్ట్ ప్రాంతంలో జరుగగా... తాజాగా లేడీ ఓరియెంటెడ్ సినిమా మైసమ్మ షూటింగ్ జరిగింది. గురువారం అర్ధరాత్రి వరకు కొత్త బంగారు లోకం హీరో వరుణ్ సందేశ్, సత్యం రాజేష్‌ల కలయికలో కొత్త సినిమాను శ్మశాన వాటిక సెట్‌లో తీశారు. శ్మశాన వాటికతో పాటు అక్కడ వేసిన కాటికాపరి గుడిసె, శివుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉండటంతో ప్రజలు చూసేందుకు వస్తున్నారు.


ఆకట్టుకుంటున్న కాటి కాపరి గుడిసె


వరుణ్ సందేశ్, సత్యం రాజేష్‌లపై శ్మశాన వాటికలో పాటను చిత్రీకరిస్తున్న దృశ్యం


'మైసమ్మ' సినిమా కోసం హెచ్ఎంటీ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన లైటింగ్


శ్మశాన వాటిక సెట్

తాగునీటి కోసం అవస్థలు

- 20 రోజులుగా ఈస్ట్ కాలనీకి సరఫరా కాని నీరు

షాపూర్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాలనీకి 20 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ఈస్ట్ కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. నెలనెలా నీటి బిల్లులు క్రమం తప్పకుండా వసూలు చేస్తున్న అధికారులు, సిబ్బంది ప్రజలకు తాగునీటి సరఫరాలో ఏర్పడిన సమస్యను ఇరవై రోజులైనా పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ ఈస్ట్ కాలనీ 7వ రోడ్డులో మూడు వారాలుగా చుక్కనీరు రాని పరిస్థితి ఉంది. లైన్‌మెన్లను అడిగితే "మేము ఎప్పటిలాగే నీరు వదులుతున్నాం. రాకపోతే మేమేమీ చేయలేం. సమస్యను అధికారులకు చెప్పండి' అని అంటున్నారు.

కాలనీలో ఈ రోడ్డు మెరకపై ఉండ టంతోనే సరిగా నీరు ఎక్కడం లేదని, గతంలో పలుమార్లు అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యను పరిష్కరించారని కాలనీవాసులు చెప్తున్నారు. అయితే, కొన్ని రోజులుగా నీరు రావడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వేసవి కాలంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

17 ఏళ్లుగా అయ్యప్ప స్వాములకు భిక్ష

- ఏర్పాటు చేస్తున్న బాచుపల్లి మాజీ సర్పంచ్

నిజాంపేట అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : నిజాంపేట కార్పొరేషన్ బాచుపల్లిలో మాజీ సర్పంచ్ ఆగం పాండు (అయ్యప్ప స్వామి) ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాలుగా ప్రతీ సంవత్సరం అయ్యప్ప స్వాములకు అన్నదానం (భిక్ష) చేస్తున్నారు. ఇదే క్రమం ఈ ఏడాది కూడా గురువారం నుంచి అన్నదానం ప్రారంభించారు. 2008 సంవత్సరంలో అయ్యప్ప మాల ధరించిన ఆగం పాండు అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతీ సంవత్సరం అయ్యప్ప స్వాములకు 42 రోజుల పాటు తన సొంత ఖర్చులతో గ్రామ శివారులోని శివాలయం వద్ద భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. భోజన ఏర్పాట్ల కోసం గుడి పక్కనే ఒక షెడ్డును నిర్మించారు. మరోపక్క తన తల్లిదండ్రుల పేరు మీద గదుల నిర్మాణం కూడా చేసట్టారు.

ప్రతి రోజూ మధ్యాహ్నం భోజన సమయానికి బాచుపల్లి, నిజాంపేట, ప్రగతినగర్, మల్లంపేట, బౌరంపేట తదితర ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారులు వచ్చి భిక్షను స్వీకరిస్తారు. ఇలా ఉండగా, ఆగం పాండు స్వామి ప్రతి సంవత్సరం దాదాపు 50 నుంచి 100 అయ్యప్ప భక్తులను తన సొంత ఖర్చులతో అయ్యప్ప దర్శనానికి శబరిమల తీసుకెళ్తుండటం గమనార్హం.


అయ్యప్ప స్వాములకు భిక్ష వడ్డిస్తున్న ఆగం పాండు


గాంధీనగర్‌కు వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్త

పారిశ్రామికవాడలో పేరుకుపోతున్న చెత్త

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్ పారిశ్రామికవాడలోని ప్రధాన రహదారుల్లో చెత్త పేరుక పోయింది. దీంతో ఈగలు, పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతుండడంతో ముక్కు మూసుకొని వెళ్లవలసిన పరిస్థితి ఉందని, పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇలా అధికారులు నిర్లక్ష్యం వల్లే పారిశుధ్యం పనులు నిర్వహించే కాంట్రాక్టర్ సక్రమంగా చెతను తొలగించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

అధ్యాపకులను వేధించడం సరికాదు : ఔటా

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాలతో అధ్యాపకులను వేధించడం సరికాదని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) అధ్యక్షులు ప్రొ. బి.మనోహర్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఓయూ సైన్స్ కాలేజీ కాన్ఫరెన్స్ హాల్లో ఔటా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాన్ టీచింగ్, టీచింగ్, విద్యార్థుల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా ఇటీవల జరిగిన సీఏఎస్ ఇంటర్వ్యూల్లో అవకతవకలు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను ఔటాలో ఉన్న ఓసీ అధ్యాపకులపై ప్రయోగించడం సరైంది కాదని, కేసులను వెంటనే వాపసం తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీ సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణను ఔటా ప్రకటిస్తుందన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్లు నతానియేల్, వెంకటేశ్వర్‌రావు, దాదాపు 100 మందికి పైగా అధ్యాపకులు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు, స్కాలర్స్, విద్యార్థులు

ఓయూ వీసీకి శుభాకాంక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ కుమార్ మొలుగరం బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు విద్యార్థి సంఘాల నాయకులు, స్కాలర్స్, విద్యార్థులు ఆయనను కలిసి బొకే శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, యూనివర్సిటీ అభివృద్ధి కోసం మరిన్ని నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కొమ్ము శేఖర్ మాదిగ, టీఎస్సీ జాక్ ఫౌండర్ వలిగొండ నరసింహ, భీమ్ ఆర్మీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు తీగల శివ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పల్లపు చందు, కాంతి ప్రణయ్ కుమార్, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేదాంత్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.


జీడిమెట్ల పీఎస్ సమీపంలో నడిరోడ్డుపై నిలిచిపోయిన డీసీఎం వ్యాన్


షాపూర్‌నగర్ చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు

డీసీఎం వ్యాన్ బ్రేక్‌డౌన్.. స్తంభించిన ట్రాఫిక్

ఇబ్బందులు పడిన వాహనదారులు

జీడిమెట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జీడిమెట్లలో గురువారం సాయంత్రం భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. పోలీస్‌స్టేషన్ సమీపంలో డీసీఎం వ్యాన్ అకస్మాత్తుగా ఆగిపోవడంతో చింతల్ నుంచి సూరారం వరకు భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రధానంగా జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వివిధ ఉత్పత్తులను తరలించే వాహనాలు నిలిచిపోవడంతో పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు పడ్డారు.జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ నర్సింహారావు ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. సూరారం నుంచి వచ్చే వాహనాలను జీడిమెట్ల పారిశ్రామికవాడ మీదుగా పైప్‌లైన్ రోడ్డువైపు మళ్లించారు. నిలిచిపోయిన వాహనాన్ని తరలించి ట్రాఫిక్‌కు నియంత్రించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.


దూలపల్లిలో పని చేయని సిగ్నల్స్

సిగ్నల్స్ ఉన్నా..లేనట్టే!

- దూలపల్లిలో పని చేయని సిగ్నల్స్
- ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల అవస్థలు

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : రద్దీగా ఉండే రహదారిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పని చేయడం లేదు. ఎన్‌హెచ్-44 రహదారి నుంచి దూలపల్లి మీదుగా బహదూర్‌పల్లి మైసమ్మగూడ, జీడిమెట్ల తదితర ప్రాంతాలకు వెళ్లేవారు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఈ ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాలలు, స్కూల్స్ , పారిశ్రామికవాడలు అధికంగా ఉన్నాయి. దీంతో దూలపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిని ఏర్పాటు చేసిన నాటి నుంచీ నేటి వరకు పని చేయడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ సిగ్నల్స్‌ను ఎందుకు ఏర్పాటు చేశారో అధికారులకే తెలియాలని, కనీసం సిగ్నల్స్ పని చేస్తున్నాయా? లేదా? అని కూడా అధికారులు చూడకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సిగ్నల్స్ పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను కలిసిన పలు కాలనీల నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి: కూన

షాపూర్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన నాయకులు, అసోసియేషన్ సభ్యులు గురువారం షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిశారు. స్థానిక సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని కోరుతూ కొందరు వినతి పత్రాలు ఇవ్వగా, మరికొందరు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీల్లో నెలకొన్న సమస్యలు, నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, దుర్గారావు, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, బొడ్డు రవి, లింగంయాదవ్, బాలరాజ్, మోతే శ్రీనివాస్‌యాదవ్, కూన రాఘవేంద్రగౌడ్, సునీల్‌చౌదరి, నాయుడు, రంగా, ఎల్లేష్, ప్రసాద్, యాదవరావు, కోటేశ్వరావు, సురేష్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహా బేగం

తాగునీటి పైపులైన్ పనుల పరిశీలన

అల్లాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా బేగం తులసీనగర్ కాలనీలో గురువారం పర్యటించారు. రూ.16 లక్షల వ్యయంతో జరుగుతున్న తాగునీటి పైప్‌లైను పనులను పరిశీలించిన సబీహా బేగం లో ప్రెషర్ కారణంగా తులసీ నగర్‌లోని పలు వీధుల్లో నీటి కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పనులు పూర్తయ్యాక నీటి కష్టాలు తీరతాయన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి గాయత్రీ నగర్ సెక్షన్ మేనేజర్ అన్వేత్ కుమార్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సాంబయ్య, చెన్న బంగారు నేత, పార్వతమ్మ పాల్గొన్నారు.



కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

బాలానగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి సునీతకు మద్దతుగా బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి గురువారం ప్రచారం నిర్వహించారు. ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్‌నగర్‌లో గడప గడపకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంతారావు, తిరుపతియాదవ్ తదితరులు

ఎన్నికల ప్రచారంలో ఓల్డుబోయినపల్లి, కూకట్‌పల్లి బీజేపీ నాయకులు

ఓల్డుబోయినపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కూకట్‌పల్లి, ఓల్డుబోయినపల్లి డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు నేతృత్వంలో నాయకులు శ్రీకర్‌రావు, ఓల్డుబోయినపల్లి డివిజన్ నాయకులు ఏనుగుల తిరుపతి యాదవ్, సత్యమూర్తి, భీంరావు, శేఖర్, వరుణ్, రాజు తదితరులు బోరబండ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోటా 31, వంకాయ 45, బెండకాయ 35, పచ్చి మిర్చి 35, బజ్జి మిర్చి 40, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజీ 28, బీన్స్ 75, క్యారెట్ 65, గోబి పువ్వు 30, దొండకాయ 35, చిక్కుడు కాయ 75, గోరు చిక్కుడు 50, బీట్‌రూట్ 50, క్యాప్సికం 60, ఆలుగడ్డ 23, కీర 23, దోసకాయ 18, సొరకాయ 20, పొట్లకాయ 28, కంద 35, ఉల్లిపోరక 40, ఉల్లిగడ్డ 20, మామిడి కాయ 15-20, అరటికాయ 10-11, చామగడ్డ 21, ముల్లంగి 6-8, చిలగడ దుంప 40, గుమ్మడికాయ 50, నిమ్మకాయలు 20-24, మునగ కాయలు 8-10, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 45, ఎండు మిర్చి 160, అల్లం 100, వెల్లుల్లి 160, చింత పండు 160, పండు మిర్చి 80, ఉసిరి 50, కరివేపాకు 80, పర్వల్ రూ.50, పల్లికాయ 55, లోబా 40, ఆ కాకరకాయ 80. పైన పేర్కొన్న ధరలు ఈ రోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



ప్రచారంలో భాగంగా స్వరాజ్‌నగర్‌లో కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేస్తున్న మంత్రి సీతక్క

జూబ్లీహిల్స్ అభివృద్ధికి రూ.500 కోట్లు

- మంత్రి సీతక్క

బోరబండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే రూ.150 కోట్లు కేటాయించిందని, అవసరమైతే మరో రూ.500 కోట్లు కేటాయిస్తుందని రాష్ట్ర మంత్రి డా.సీతక్క తెలిపారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడమే కాకుండా వారిని యజమానులుగా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. బోరబండ డివిజన్ స్వరాజ్ నగర్‌లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్, కార్పొరేటర్ ఎం.డి. బాబా ఫసియుద్దీన్‌తో కలిసి గురువారం ఆమె ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీఎల్పీ మాజీ నేత పీజేఆర్ మరణానంతరం జరిగిన ఉప ఎన్నికలో అభ్యర్థిని బరిలోకి దింపినప్పుడు బీఆర్ఎస్ నాయకులకు సానుభూతి గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు ముఝ్వా విజయ్ బాబు, బండ్రు శోభారాణి, బోరబండ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.అశోక్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, రజీ, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు

- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేయని అధికారులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు





గుంతలమయంగా ఉన్న ఎంఐజీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి

భెల్‌కాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్-ఎంఐజీకాలనీ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. భారీగా ఏర్పడ్డ గుంతలు వాహనదారుల పాలిట శాపంగా మారాయి. గుంతలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా టౌన్‌షిప్ ఎస్టేట్ అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి విద్యార్థులు, కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో అధికారుల నిర్లక్ష్య ధోరణిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై నూతన రోడ్డును నిర్మించి ఏళ్లు గడుస్తున్నా కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రధాన రహదారిపై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. చినుకు పడితే వాహనదారుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఇప్పటికైనా ఎస్టేట్ అధికారులు స్పందించి గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- రాయదుర్గంలో పర్యటించిన ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలపై మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కొంతం చంద్రశేఖర్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఐటీ కారిడార్‌లో అత్యంత కీలకమైన రహదారిగా ఉన్న గచ్చిబౌలి బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి ఐకియా-మైండ్‌స్పేస్ జంక్షన్ మీదుగా హైటెక్ సిటీ- సైబర్ టవర్స్ వెళ్లే మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మార్గంలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినా ట్రాఫిక్ జామ్‌లు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణాలను తెలుసుకునేందుకు మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కొంతం చంద్రశేఖర్ రెడ్డి రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి ఆ మార్గంలో పర్యటించారు. ప్రధానంగా గెలాక్సీ టవర్స్ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ ఉన్న కూడలిలో అక్రమ పార్కింగ్‌లు చేస్తున్నట్లు గుర్తించారు. గెలాక్సీ టవర్‌లో ఉన్న ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల కోసం వచ్చే వారు అక్కడి రోడ్ల మీద తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతున్నట్లు గుర్తించి, గెలాక్సీ టవర్ యజమానులతో ఏసీపీ చర్చించారు. సందర్శకులైనా, ఉద్యోగులైనా కమర్షియల్ కాంప్లెక్సుల్లోనే పార్కింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్‌లను తగ్గించేందుకు ఐటీ ఉద్యోగులతో పాటు కంపెనీల నిర్వాహకులు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి కోరారు.



రాయదుర్గంలోని గెలాక్సీ టవర్ వద్ద ట్రాఫిక్ జామ్ సమస్యలపై అక్కడి భవన నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి



పాపిరెడ్డికాలనీలో రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు



కూకట్‌పల్లి దయార్‌గూడలో రోడ్డుపై నిలిచి ఉన్న వాహనాలు

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

కూకట్‌పల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డికాలనీ, ఆస్బెస్టస్ కాలనీలో అక్రమ పార్కింగ్‌తో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలను రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండటంతో రోజురోజుకు ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. కూకట్‌పల్లి దయార్‌గూడ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి ఉంటున్నాయి. కొన్ని వాహనాలు నెలల తరబడి ఇక్కడే ఉన్నాయి. దీంతో ట్రాఫిక్ పీఎస్ నుంచి దయార్‌గూడ మీదుగా నల్లచెరువు వైపు వెళ్లే వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

ఆస్బెస్టస్ కాలనీ కమాన్ వద్ద..

అస్బెస్టస్ కాలనీ కమాన్ నుంచి సాయిసుధ స్వీట్స్ దుకాణం వరకు, బస్తీ దవాఖానా భవనం చుట్టూ, బిర్ల కళ్యాణ మండపం వద్ద, పార్కు సమీపంలో, ప్రధాన రోడ్డులో వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు తప్ప సమస్యను పరిష్కరించడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలను తొలగించాలి

ఆస్బెస్టస్ కాలనీ కమాన్ సమీపంలో కొందరు తమ వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. దానికి తోడు అక్రమ పార్కింగ్‌తో కాలనీలో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలి.

- ఎమ్.నరేశ్, ఆస్బెస్టస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

డబ్బులు తిరిగివ్వడం లేదని స్నేహితురాలిపై ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యాపారం చేస్తానంటే ఇచ్చిన డబ్బులు అడిగితే తిరిగి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న స్నేహితురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావు నగర్‌లో ఉంటున్న తృప్తి శ్రేయకు స్నేహితురాలు అజ్మీర యామిని వ్యాపారం చేద్దామని ప్రతిపాదన పెట్టింది. వచ్చిన లాభంలో సగం వాటా ఇస్తానని చెప్పి రూ.3 లక్షలు కావాలని అడగగా ఇచ్చింది. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా క్యూనెట్ పేరుతో తప్పుడు వ్యాపారం చేస్తూ ప్రజల నుంచి అధిక వడ్డీలు గుంజుతున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఇలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకొని, డబ్బులు ఇప్పించాలని కోరింది.

హోటల్‌లో వ్యభిచారం.. పట్టుబడిన విదేశీ యువతి

బంజారాహిల్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హోటల్ గదిలో వ్యభిచారం జరుగుతుండగా పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో విదేశీ యువతి కూడా దొరికింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10లోని ఓ హోటల్‌లోని మూడు గదుల్లో వ్యభిచారం జరుగుతుందని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే దాడులు నిర్వహించగా, నలుగురు యువతులు, ఏడుగురు విటులు దొరికారు. నిర్వాహకుడు జావీద్‌ఖాన్ అలియాస్ బాబా పరారీలో ఉన్నాడు. ఇదిలా ఉండగా, యువతుల్లో ఒకరు ఉజబేకిస్థాన్ దేశానికి చెందిన పౌరురాలిగా గుర్తించారు. వీరందరిని రెస్క్యూ హోంకు తరలించిన బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సీఎం సహాయనిధి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

సీఎం సహాయనిధి అందజేత

హైదర్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దీనబంధు కాలనీకి చెందిన యూసఫ్‌కు మంజూరైన రూ.2.50లక్షల సీఎంఆర్ఎఫ్‌ను గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి వరంగా మారిందన్నారు



ఏసీపీ కార్యాలయంలో ఉన్న వంశీరెడ్డి తదితరులు

అక్రమ అరెస్టులు సరికాదు: వంశీరెడ్డి

హైదర్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గోవధకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని అక్రమ అరెస్టులతో ఆపలేరని వివేకానందనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వంశీరెడ్డి అన్నారు. గోవుల రక్షణ కోసం ఉద్యమిస్తున్న హిందూ యువకుడిపై కాల్పులు జరగడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపిన వారిని అరెస్టు చేసి చిక్కడపల్లి ఏసీపీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గోవధకు వ్యతిరేకంగా ఉద్యమించే వారిపై అక్రమ కేసులు బనాయించి నిర్బంధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కల్యాణి, దుర్గాప్రసాద్, కృష్ణంరాజు, నర్సింగరావు, రేషన్ రాజు, లక్ష్మణ్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్

విద్యుత్ వైర్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

- రూ.4 లక్షల విలువైన వైర్లు, కారు, బైక్ స్వాధీనం

మియాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనాల్లో విద్యుత్ వైర్లు చోరీ చేస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర దొంగలను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల విలువైన విద్యుత్ వైర్లు, నేరాలకు ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన దిలీప్ కుమార్, హఫీజ్ పేటలో నివాసముంటున్న నిశాల్ కర్లకర్ స్నేహితులు. వీరిద్దరూ జల్సాల కోసం డబ్బు సంపాదించేందుకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు పగటిపూట నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో కారులో వెళ్లి విద్యుత్ వైర్ల బండిళ్లను చోరీ చేసేవారు. నిందితులపై గతంలో అనేక కేసులు నమోదైనట్లు ఏసీపీ తెలిపారు. పలు భవన నిర్మాణదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో నిఘా పెట్టిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల విలువైన విద్యుత్ వైర్లు, కారు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిర్మాణంలో ఉన్న భవన యజమానులు తమ విలువైన వస్తువుల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మహేంద్ర భాటి (ఫైల్)

మియాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలను ఇన్‌స్టాల్ చేస్తున్న కార్మికుడు విద్యుత్ షాక్‌తో మరణించిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మదీనగూడ ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీకి చెందిన మహేంద్ర భాటి (36) సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం మియాపూర్ ఆల్విన్ కాలనీ ప్రాంతంలో ఓ ఇంటిలో పనిచేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. సాటి కార్మికులు అతడిని ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


యాచకుల వెతలు తీరేనా?

- జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో జంట సర్కిళ్లలో పూర్తయిన సర్వే
- 27 మందిని గుర్తించిన అధికారులు
- వాస్తవానికి 250 మందికి పైగా ఉంటారని అంచనా

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యాచకులకు మంచి రోజులు రానున్నాయా? కుటుంబంలో ఆదరణ లేని, ఆర్థికంగా వెనుకబడిన వృద్ధులు చాలా మంది రోజూ పొట్టకూటి కోసం ఆలయాలు, బస్టాపులు, మెట్రో స్టేషన్ల వద్ద ఆహారం, డబ్బుల సాయం కోరుతూ కనిపిస్తుంటారు. కూడు, గుడ్డ, గూడు వంటి వాటితో పాటు వారి ఆరోగ్య పరిస్థితి ఏంటనే దానిపై జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 13, 14, 15 తేదీల్లో సర్వే జరిగింది. భిక్షాటన చేసే వారికి హక్కులు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. వీరికి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం శుభ వార్త చెప్పనుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సర్వే చేయాలని ఆదేశించగా.. జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో యాచకులపై సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందించారు.

జంట సర్కిళ్లలో సర్వే ఇలా..

జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి సర్కిల్ పరిధి ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలానగర్, కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్ కాలనీ, హైదర్‌నగర్ డివిజన్ల పరిధిలో పీవో భోగేశ్వర్లు ఆదేశాల మేరకు సీవోలు పాపన్న గౌడ్, ముస్తఫా, మహిపాల్‌రెడ్డి, సుజాత క్షేత్రస్థాయిలో సర్వేలో పాల్గొన్నారు. ఇక మూసాపేట్ సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, మూసాపేట్, అల్లాపూర్, ఫతేనగర్ డివిజన్ల పరిధిలో పీవో జంధ్యాల ఉమా ఆదేశాల మేరకు సీవోలు కొండబత్తుని మురళి, కిషోర్ కుమార్, ఇందిర సర్వేలో పాల్గొని యాచకుల డేటా సేకరించారు. భిక్షాటన చేసే సమయం, ఎదురవుతున్న సవాళ్లు, రాత్రిపూట నిద్రించే ప్రదేశం, అనారోగ్యం తలెత్తితే ఎక్కడకు వెళ్తారు? ఇలా సుమారు 20 ప్రశ్నలతో సర్వే చేయగా.. నాలుగు లేదా ఐదుగురు మించి కనీసం ఐదు ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. ఉదయం భిక్షాటన చేసుకొని సాయంత్రం ఇంటికి చేరుకునే వారే అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఏ ఒక్కరూ ఫోన్ నంబర్ ఇవ్వలేదు. కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్, మూసాపేట్ మెట్రో స్టేషన్, కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి బస్టాపులు, జేఎన్‌టీయూ చౌరస్తా, బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా, మూసాపేట్ చౌరస్తాల్లో ఉదయం, సాయంత్రం చేసిన సర్వేల్లో యాచకులు కొందరు అనారోగ్యంతో కనిపించారు. కొందరు మాట్లాడలేని స్థితిలో ఉండటం చూసి సర్వేకు వెళ్లిన ఉద్యోగులు భావోద్వేగానికి లోనయ్యారు. ఇలాంటి వారికి ప్రభుత్వం సహాయం చేస్తే బాగుంటుందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్‌లో 16 మందిని గుర్తించగా.. అందులో ఎనిమిది మంది పురుషులు, ఏడుగురు స్త్రీలు, ఒకరు దివ్యాంగులు కాగా.. మూసాపేట్ సర్కిల్ 11 మందిని గుర్తించగా.. అందులో ఏడుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. నగరంలో నివాసం ఉండేవారు చాలా తక్కువ. మహబూబ్‌నగర్, సంగారెడ్డి, జహీరాబాద్, మెదక్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్తుంటారని సర్వేలో తేలింది.



కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ వద్ద యాచకురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీవోలు పాపన్న గౌడ్, ముస్తాఫా, సుజాత



మూసాపేట్‌లో యాచకుడి నుంచి వివరాలు సేకరిస్తున్న సీవో కొండబత్తుని మురళి

నామమాత్రంగా సర్వే చేశారా?

జంట సర్కిళ్ల పరిధిలో నిత్యం భిక్షాటన చేసే వారికి న్యాయం చేయాలంటే అన్ని చోట్ల సర్వే జరగాల్సిన అవసరం ఉంది. రెండు సర్కిళ్లలో 27 మంది జాబితాను మాత్రమే ఉన్నతాధికారులకు పంపించారు. కానీ క్షేత్రస్థాయిలో కనీసం 250-300 మంది వరకు ఉంటారనే చర్చ నడుస్తోంది. ఏ ఆలయం వద్ద చూసినా కనీసం ఇద్దరు, ముగ్గురు యాచకులు తారస పడుతుంటారని వివేకానందనగర్‌కు చెందిన లక్ష్మీదేవి చెబుతున్నారు. ఇక కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు వద్ద ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిత్యం భిక్షాటన చేస్తూ ఉంటారని రోజూ ఆలయానికి వెళ్లే నాగలక్ష్మి చెబుతున్నారు. మరి ఏదో టార్గెట్ ఇచ్చారు కదా అని నామమాత్రంగా సర్వే చేయడం వల్ల ప్రయోజనం ఏముందన్నది తెలియాలి. సర్వే మూడు రోజుల్లో చేయమని ఆదేశాలు ఇచ్చినా ఇక్కడి వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని అవసరం అయితే మహిళా సంఘాల ప్రతినిధులు, ఆలయాల కమిటీ ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సహకారం తీసుకొని సర్వే చేస్తే ఎక్కువ మంది ఆ జాబితాలో ఉండేవారని పలువురు చర్చించుకుంటున్నారు.